# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 273 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 30 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

# ఎస్ఐఆర్ తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్

**ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్**

**హాజరైన సీఎం రేవంత్, మీనాక్షి నటరాజన్ తదితర నేతలు**

**బెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారన్న మహేశ్ గౌడ్**

**గాంధీభవన్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం..**




**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ..మిగతా 2లో

## దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు
# తెలంగాణ నుంచే...




## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై మంత్రి మీడియా సమావేశం**

**ప్రతిపక్షాలు కావాలనే విమర్శలు చేస్తున్నాయని మండిపాటు**

**75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా**

**ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వెల్లడి**

**ఇప్పటికే రూ.13,050 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్న మంత్రి**

**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

ధాన్యం కొనుగోళ్ల అంశంపై ప్రతి పక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు.

**చివరి గింజ వరకు కొంటాం**

రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని ..మిగతా 2లో

## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న
# రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**ఉద్యోగుల బకాయిలను 100 రోజుల్లో విడుదల చేస్తామని హామీ**

**ఈ క్రమంలో తొలి విడతగా రూ.2 వేల కోట్ల బకాయిల విడుదల**

**ఉద్యోగ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం**




**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని ఇవాళ విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా ..మిగతా 2లో

## ముగిసిన బండి భగీరథ్
# పోలీసు కస్టడీ

**జైలుకు తరలింపు**

**మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు భగీరథ్‌పై ఆరోపణలు**

**భగీరథ్ పై పోక్సో కేసు పెట్టిన పోలీసులు**

**మూడు రోజుల పాటు భగీరథ్‌ను ప్రశ్నించిన పోలీసులు**



**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. భగీరథ్ ను పోలీసులు మూడు రోజుల పాటు విచారించారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు ప్రత్యేక విచారణాధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్ ను విచారించారు. సీన్ రీకన్స్ట్రక్షన్ చేసేందుకు ..మిగతా 2లో

# మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి మృతి



## సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి మరణం.. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో విషాదాన్ని నింపింది. వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో తన ఇంట్లో ఆయన కన్నుమూయగా.. పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలుపుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గాదె వెంకట్ రెడ్డి మరణంపై సంతాపం వ్యక్తం చేశారు. గాదె వెంకట్ రెడ్డి ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయాల్లోనూ వెంకట్ రెడ్డి తన సేవలందించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# రాహుల్ ముందు సిద్ధూ డిమాండ్ల జాబితా

## కుమారుడికి మంత్రి పదవి..

**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

కర్ణాటక ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన సిద్ధరామయ్య.. శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ కూర్పుపై వీరిద్దరూ సమాలోచనలు జరిపారు. సిద్ధూ రాజకీయ భవిష్యత్తుపైనా చర్చించినట్లు సమాచారం. ఈ సంద ర్భంగా రాహుల్ ముందు సిద్ధరామయ్య పలు డిమాండ్లను ఉంచినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. తన కుమారుడు యతీంద్రకు కీలకమైన మంత్రిత్వశాఖను కేటాయించాలని ఆయన హైకమాండ్‌ను కోరినట్లు ....మిగతా 2లో





**క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా**

## ఇళ్ల డిజైన్

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి** 2

## దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు

# తెలంగాణ నుంచే...

**మొదటి పేజీ తరువాయి...**

సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.

**తడిసిన ధాన్యం కూడా కొనుగోలు**

ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు



చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ. 13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

**రవాణా కోసం ప్రత్యేక చర్యలు**

ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

---

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, మే 29 (నమస్తే ఉదయం)**

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి



రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

---

# అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పాగా

**పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ విజయభేరి**

**ఛండీగఢ్, మే 29 (నమస్తే ఉదయం)**

పంజాబ్ లోని అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించింది. 50 వార్డుల్లో 28 వార్డులు సొంతం చేసుకుంది. దీంతో అబోహర్‌లో బీజేపీ తొలిసారి మేయర్ పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 2027లో కీలకమైన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ గెలుపు బీజేపీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించారు. బీజేపీ 28 వార్డులు గెలుచుకోగా, ఆప్ 20 వార్డులతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ఒక స్థానం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు. కాలిఫోర్నియా ఆఫ్ పంజాబ్'గా అబోహర్‌ను పిలుస్తారు. కిన్నో పండ్ల సాగు, బలమైన వ్యవసాయ ఆదాయం కలిగిన ప్రాంతమిది. ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగిన అర్బన్ సెంటర్లలో ఇదొకటి. ఈ ప్రాంతంలో ఓటర్ల మనోభావాలను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, 2027 ఎన్నికలకు ముందు ఇలాంటి ఫలితం వెలువడంతో ఆసక్తికరమని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీలకు మే 26న ఎన్నికలు జరిగాయి. మోహాలి, బటిండా, అబోహర్, బర్నాలా, కపుర్తాలా, మోగా, బటాలా, పఠాన్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో 7.555 మంది పోటీ చేశారు. ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సాద్‌తో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల చేదు అనుభవాలను చవిచూసిన ఆమ్ ఆద్మీ పార్టీ కు ఎట్టకేలకు ఊరట లభించింది. ఆప్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన పంజాబ్‌లో ఈనెల 26న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు శుక్రవారంనాడు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం సాధించింది. పంజాబ్‌లోని 102 నగర పాలక సంస్థలకు ఈ ఎన్నికలు జరుగగా, వీటిలో 8 మున్సిపాలిటీలు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 19 నగర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,869 వార్డులకు గాను శుక్రవారం రాత్రి వరకు వెలువడిన ఫలితాల్లో 939 వార్డులను ఆప్ కైవసం చేసుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో సగానికి పైగా వార్డులను దక్కించుకుంది.

---

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 29(నమస్తే ఉదయం):**

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు .ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు పోలీసు గౌరవ వందనం ఏర్పాటు చేయాలని, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా



చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా,వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకేంద్రంలోని స్మృతి వనం, పాత బస్టాండ్ వద్ద గల తెలంగాణ పోరాట యోధుల విగ్రహాల వద్ద, సభాస్థలి వేదికలను పూలతో అందంగా అలంకరించాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, మధు మోహన్, ఆర్డిఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ భూపాల్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---



## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి...**

రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని

# ప్రారంభించిన కాంగ్రెస్

**మొదటి పేజీ తరువాయి...**

తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

## ముగిసిన బండి భగీరథ్

# పోలీసు కస్టడీ

**మొదటి పేజీ తరువాయి...**

మొయినాబాద్ ఫామ్ హౌస్ కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్ కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.




# సెన్సస్‌ను వేగవంతం చేయాలి

**భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచవద్దు.**

**పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు:**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 29(నమస్తే ఉదయం)**

జనగణన 2027 లో భాగంగా మొదట ఈ ఏడాది చేపట్టిన ఇండ్ల గణనను జూన్ 9వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 2.18 లక్షల ఇండ్లు ఉండగా ఇప్పటివరకు ఎన్నుమరేటర్లు దాదాపు 1.79 లక్షల ఇళ్ల గణన పూర్తి చేశారని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. చార్జ్ అధికారులుగా ఉన్న తహసిల్దార్ లు, తమ పరిధిలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లతో తరచూ మాట్లాడుతూ జిల్లాలో 95 శాతానికి పైగా హౌస్ లిస్ట్ ఆపరేషన్ జరిగేలా కృషి చేయాలన్నారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని, ఇతర భూ సంబంధ సమస్యలను కూడా అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాలోని రేషన్ దుకాణాలను సంబంధిత మండలాల తహసిల్దార్లు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. అలాగే పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా ఉంచాలని, అవకతవకలకు పాల్పడే రేషన్ డీలర్లు, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కీ బోర్డు వాయించడంలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన కోరని అమ్మార కమల్

**బుద్వేల్, మే 29 (నమస్తే ఉదయం)**

హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 2వ తేదీన నగరంలో 777 మంది చిన్నారులతో నిర్వహించిన సామూహిక కీ బోర్డు వాయించే కార్యక్రమంలో పాల్గొన్న బుద్వేల్ నివాసి కోరని అమ్మార కమల్ శుక్రవారం గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్నారు. గచ్చిబౌలి స్టేడియం లో జరిగిన సర్టిఫికెట్ ప్రధానోత్సవ కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకులు పాస్టర్ ఆగస్టీన్ చేతుల మీదుగా కోరని అమ్మార కమల్ సర్టిఫికెట్ అందుకున్నారు. తమ మనుమరాలు చిన్న వయస్సులోనే గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందుకోవడం పట్ల తాత కోరని దేవదానం, బాలిక తల్లిదండ్రులు కోరని అభిషేక్, జోహోశ్యామ లు హర్షం వ్యక్తం చేశారు.


పాస్టర్ ఆగస్టీన్ చేతుల మీదుగా గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్ అందుకుంటున్న కోరని. అమ్మార కమల్



సర్టిఫికెట్, మెడల్ తో కోరని అమ్మార కమల్

# ఉద్యోగ విరమణ పొందిన గుండాల నర్సింహ్మా


ఉద్యోగ విరమణ పొందిన గుండాల నర్సింహా ను సన్మానిస్తున్న పీడీపీ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎన్ చటర్జీ

**బుద్వేల్, మే 29 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని ప్రాజెక్టు డైరెక్టరేట్ ఆన్ ఫౌల్ట్రీ (పీడీపీ) లో స్కిల్డ్ సపోర్టింగ్ స్టాఫ్ ( ఎస్ఎస్ఎస్) ఉద్యోగం చేస్తున్న రాజేంద్రనగర్ నివాసి గుండాల నర్సింహ్మా శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ అయిన పీడీపీ లో 37 సంవత్సరాలుగా గుండాల నర్సింహ్మా ఉద్యోగం చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే నర్సింహ్మా ను ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎన్ చటర్జీ తో పాటు శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, చిన్ననాడు తనతో కలసి చదువుకున్న మిత్రులు కలసి ఘనంగా సన్మానించారు. కూరగాయల నర్సమ్మ కుమారుడైన గుండాల నర్సింహ్మా శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐష్టాశ్వర్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గుండాల నర్సింహ్మా సతీమణి గుండాల పుష్పకళ, సోదరులు గుండాల క్రిష్ణ, గుండాల శ్రీనివాస్, గుండాల వెంకటేశ్ ల కుటుంబ సభ్యులతో పాటు కుమారులు యశ్వంత్, ప్రణయ్, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన గుండాల నర్సింహా దంపతులకు సన్మానం చేస్తున్న బంధువులు

# పొగాకు రహిత సమాజంతోనే ఆరోగ్యం: సీఐ ఎం.లక్ష్మారెడ్డి

## 'ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి : మే 29, (నమస్తే ఉదయం)**

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పొగాకు దాని ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఈ గోడ పత్రికను గచ్చిబౌలిలోని సైబరాబాద్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుండి ప్రతి సంవత్సరం మే 31న ఒక ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాది "నికోటిన్, పొగాకు వ్యసనాన్ని ఎదుర్కోవాలని పిలుపునివ్వడం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. పొగాకు వల్ల ప్రపంచవ్యాప్తంగా


పొగాకు వ్యతిరేక దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సిఐ లక్ష్మారెడ్డి

ఏటా 80 లక్షల మంది, భారతదేశంలో 13.5 లక్షలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని అన్నారు.

**యువతను బలితీసుకుంటున్న వ్యసనం:**

ప్రస్తుత కాలంలో యువత ధూమపానానికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, క్యాన్సర్, క్షయ, దంతక్షయం వంటి భయంకరమైన వ్యాధులు వస్తున్నాయని హెచ్చరించారు. పొగాకులోని 'నికోటిన్' వల్ల రక్తపోటు, పక్షవాతం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. సిగరెట్లు, గుట్కా, పాన్ పరాగ్,




హుక్కా, బీడీ వంటి రూపాల్లో వీటిని వాడుతున్నారని కేవలం వాడేవారే కాకుండా, పక్కన ఉండి ఆ పొగను పీల్చేవారు సైతం (సెకండ్ హ్యాండ్ స్మోకింగ్) రోగాల బారిన పడుతున్నారని, దీని ప్రభావం పిల్లలపై మరీ ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు.


ఒక సిగరెట్ తాగితే మనిషి జీవితకాలంలో 20 నిమిషాల ఆయుష్షు తగ్గుతుందని లక్ష్మారెడ్డి వివరించారు పొగాకు ఉత్పత్తి, ఎగుమతుల్లో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయని, దేశంలో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో దీనిని ఎక్కువగా పండిస్తున్నారని తెలిపారు. పొగాకు మహమ్మారి వల్ల ఆరోగ్యం, ఆర్థిక స్థితి దెబ్బతినడమే కాకుండా ప్రాణ నష్టం సంభవిస్తోందని 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూత్రాన్ని నమ్మి వీటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం, పౌష్టికాహార అలవాట్లతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. ధూమపానం మానాలనుకునే వారు దృఢ సంకల్పంతో ఉండాలని, పొగ తాగాలనిపించినప్పుడు ఆరోగ్యకరమైన చిరుతిళ్లు, నారింజ, బత్తాయి, ద్రాక్ష వంటి పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. అలాగే చూయింగ్ గమ్స్, చాక్లెట్లు, పుదీనా ఆకులు, పచ్చి కూరగాయలు, ఎక్కువ నీరు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు నమలడం, గోరువెచ్చని పాలు, నిమ్మరసం తాగడం ద్వారా ఈ అలవాటు నుండి సులభంగా బయటపడవచ్చని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎం. శ్రీహరిబాబు, కొత్తపల్లి కోటేశ్వరరావు, అమ్మయ్య చౌదరి, జీ.వీ. రావు, సత్యనారాయణ, వాణీ సాంబశివరావు, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు

# గండిపేట 'సర్కారు' భూమికి ఎసరు: నకిలీ జీఓల ముఠా గుట్టురట్టు!

## శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ సంచలన నిజాలు

## రంగంలోకి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు?

## తెరవెనుక రూ.4 కోట్ల డీల్.. ముగ్గురు అరెస్ట్, నలుగురు పరారీ!



గండిపేట భూమి విషయంపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాసరావు. నిందితులు ఫోటో లు

**శేరిలింగంపల్లి , మే 29,(నమస్తే ఉదయం)**

వంద కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై కన్నేశారు.. కోర్టులు ఛీత్కరించుకున్నా లొంగలేదు.. ఏకంగా ప్రభుత్వ ముద్రలతో నకిలీ జీఓలనే సృష్టించి, సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ కోట్ల రూపాయల దందాకు తెరలేపారు. గండిపేట పరిధిలోని ప్రభుత్వ పోరంబోకు భూమిని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసిన ఒక భారీ కేటుగాళ్ల ముఠా గుట్టును శేరిలింగంపల్లి పోలీసులు రట్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ వైసీపీ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈ కథ మొత్తాన్ని నడిపించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఈ హైప్రొఫైల్ భూ కుంభకోణం వివరాలను శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో వెల్లడించారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని విలువైన ప్రభుత్వ భూమిని తమ సొంతం చేసుకోవాలని 'నిమ్మల' కుటుంబం చాన్నాళ్లుగా స్కెచ్ వేసింది. ప్రభుత్వ భూమిపై హక్కులు తమవేనంటూ హైకోర్టులో పిటిషన్లు వేసినా.. గతేడాది అక్టోబర్ 2025లోనే కోర్టు వాటిని కొట్టిపారేసింది. చట్టబద్ధంగా ఎలాంటి హక్కులు లేకపోయినా, ఈ కేటుగాళ్లు వెనక్కి తగ్గలేదు.ప్రభుత్వమే ఈ భూమిని తమకు క్రమబద్ధీకరించిందంటూ ఏకంగా 5 నకిలీ జీఓ లను సృష్టించారు. ఆ ఫోర్జరీ పత్రాలను వాట్సాప్, సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ.. ఎకరాకు రూ. 3.5 కోట్ల చొప్పున భూమిని అమ్మకానికి పెట్టి మాయాజాలం మొదలుపెట్టారు.

**తెరపైకి వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. రూ. 4 కోట్ల అక్రమ డీల్!**

ఈ నకిలీ పత్రాల వెనుక భారీ స్థాయిలోనే డీల్ కుదిరినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితులు వినుకొండ వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌లతో భూమి అమ్మకానికి అక్రమ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ డీల్‌లో భాగంగా నిమ్మల ఫ్యామిలీ ఖాతాలోకి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు నుంచి రెండు విడతలుగా ఒకసారి కోటి రూపాయలు, మరోసారి రూ. 25 లక్షలు డబ్బులు బదిలీ అయ్యాయి. మొత్తంగా ఈ అక్రమ భూ లావాదేవీల్లో దాదాపు రూ. 4 కోట్లు చేతులు మారినట్లు పోలీసులు గుర్తించారు. తహసీల్దార్ అలర్ట్.. సీన్‌లోకి పోలీసులు:

నిందితులు ప్రభుత్వం భూమిని తమకు క్రమబద్ధీకరించిందంటూ సోషల్ మీడియా ప్రచారం ప్రచారం చేసుకుని సదరు భూమిని గ్రహించేందుకు మార్కెట్లో పెట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు అప్రమత్తమైన స్థానిక తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లపై దాడులు చేసి, కీలకమైన బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురు లాకప్‌లోకి.. నలుగురి కోసం వేట!**

ఈ కేసులో ప్రధాన నిందితులైన నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, ఈ కేసులో కీలక సూత్రధారులైన బొల్లా రమేష్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, సునీల్, రాధాకృష్ణ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు తీవ్రం చేసినట్లు డీసీపీ తెలిపారు.

**పోలీసుల హెచ్చరిక: భూమి కొనేముందు జాగ్రత్త!**

ఈ సంచలన కేసు నేపథ్యంలో ప్రజలకు డీసీపీ శ్రీనివాస్ కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలను చూసి మోసపోవద్దని హెచ్చరించారు. భూములు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చట్టపరమైన నిశ్చితార్థం తర్వాతే లావాదేవీలు జరపాలని ఆయన స్పష్టం చేశారు.


అర్ధం లక్ష్మయ్య గుప్తా, రేణుగుంట్ల గణేష్ గుప్తా లను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా కాటేదాన్‌కు చెందిన అర్థం లక్ష్మయ్య గుప్తా ఎన్నిక

**బుద్వేల్, మే 29 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా నియమితులైన కాటేదాన్ నివాసి అర్ధం లక్ష్మయ్య గుప్తా, కోశాధికారి గా నియమితులైన శంషాబాద్ వాస్తవ్యులు రేణుగుం ట్ల గణేశ్ గుప్తా లను శుక్రవారం కాటేదాన్ శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, సిరంగి బుచ్చయ్య గుప్తా ల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వనపర్తి భద్రీనాథ్ గుప్తా, ఓరుగంటి మల్లేశ్ గుప్తా, పెంటపాటి శ్రీనివాస్ గుప్తా, గుడిపల్లి రవి కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



బండి ప్రతాప్ రెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కుమార్తె దుంబాల ఝాన్సీ రెడ్డి తదితరులు

# బీజేపీ సీనియర్ నాయకులు దివంగత బండి ప్రతాప్ రెడ్డికి ఘన నివాళులు

**బుద్వేల్, మే 29 (నమస్తే ఉదయం):**

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు, ప్రేమావతిపేట్ నివాసి దివంగత బండి ప్రతాప్ రెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ప్రేమావతిపేట్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు, బండి ప్రతాప్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు. బండి ప్రతాప్ రెడ్డి 1987 లో రాజేంద్రనగర్ మునిసిపాలిటీలో కౌన్సిలర్ గా పనిచేశారు. ఆయన సుదీర్ఘ కాలం పాటు మహారాణ ప్రతాప్ ఆర్ఎస్ఎస్ శాఖ కు కార్యనిర్వాహక్ గా పనిచేశారు. దేశం పట్ల, ధర్మం పట్ల ఎంతో భక్తి శ్రద్ధలు ఉన్న ప్రతాప్ రెడ్డి కరోనా సమయంలో ఐదు సం వత్సరాల క్రితం మరణించారని ఆయన కుమార్తె దుంబాల ఝాన్సీరెడ్డి తెలిపారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 29(నమస్తే ఉదయం):**

ఇటీవల కొండాపురం గ్రామంలో కురిసిన వర్షాలకు హరిజన్ వాడలో నివసిస్తున్న ముత్యాల చిన్నన్న ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఎస్ పవన్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మండల అధికారులతో చరవాణి ద్వారా సంప్రదించి బాధిత కుటుంబాని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని కోరారు. అలాగే బాధితుడికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.





# తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా రేణుగుంట్ల గణేష్ గుప్తా

## మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అర్ధం లక్ష్మయ్య గుప్త

## రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం స్వీకరించిన గణేష్ గుప్తా

**రాజేంద్రనగర్, మే 29(నమస్తే ఉదయం)**

తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కోశాధికారి గా నియమితులు గా అయినా రేణుగుంట్ల గణేష్ గుప్తా నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ గుప్తా చేతుల మీద గా రేణుగుంట్ల గణేష్ గుప్తా, వైస్ ప్రెసిడింట్ గా అర్ధం లక్షమయ్య గుప్తా నియామక పత్రం లు స్వీకరించారు. ఈ కార్యాక్రమం లో సోమ శ్రీనివాస్ గుప్తా, రంగారెడ్డి జిల్లా కోశాధికారి వనపర్తి బద్రీనాథ్ గుప్తా ,సిరంగి బుచ్చయ్య గుప్తా, ఓరుగంటి మల్లేష్ గుప్తా, పెంటపాటి శ్రీనివాస్ గుప్తా, గుడిపల్లి రవికుమార్ గుప్తా తదితరులు పోల్గన్నారు.

# రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరం





## తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండా రాజి రెడ్డి

**సిద్దిపేట, మే29(నమస్తే ఉదయం)**

రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరమని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండా రాజి రెడ్డి అన్నారు.. దీనికి రైతులే టార్చ్ బేరర్ లు గా ముందుండి నడిపించాలని కోరారు. భవిష్యత్తులో సంభవించనున్న సూపర్ ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ సమగ్ర పోషక నిర్వహణ, సమగ్ర పురుగు నియంత్రణ పద్ధతులను రైతులకు విస్తృతంగా చేర్చాలని విస్తరణ నిపుణులను సూచించారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ములుగు, సిద్ధిపేటలోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయలో జోనల్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. దండా రాజిరెడ్డి అధ్యక్షత వహించారు. జీవ నియంత్రణ పద్ధతులు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో కీలకమని రాజిరెడ్డి అన్నారు. అధిక ఎరువుల వినియోగం వల్ల నేల కాలుష్యం పెరిగి మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. రైతులకు అవగాహన కల్పించే విస్తరణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి 50 కిలోమీటర్ల పరిధిలో ఒక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసే విధంగా ప్రామాణిక విధానాలు అమలు చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలను తగ్గించే సాంకేతిక పరిజ్ఞానాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అగ్రి హార్టీ సొసైటీ కార్యదర్శి, ఐసిఏఆర్ పాలక మండలి సభ్యులు కె. వీరభద్రరావు మాట్లాడుతూ తెలంగాణలో పాడైపోయిన పాలీహౌస్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు సంతృప్తే ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధికి ఎన్ హెచ్ బి , నాబార్డ్, సి ఎస్ ఆర్ నిధులను సమర్థవంతంగావినియోగించుకోవాలని సూచించారు. కాలిఫోర్నియా వంటి వాతావరణ పరిస్థితులు తెలంగాణ లోను ఉండటంతో రాష్ట్రంలో పలు ఉద్యాన పంటలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బాలానగర్ సీతాఫలం, ద్రాక్ష తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చే పండ్లుగా అభివర్ణించారు. నేల ఆరోగ్య పరిరక్షణకు బోన్ మీల్, బ్లడ్ మీల్ వంటి సేంద్రీయ పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కోతుల సమస్య రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, దీనిపై శాస్త్రీయ పరిష్కారాలు అవసరమన్నారు. తెలంగాణలో విస్తృతంగా చెట్ల నాటకం చేపట్టాలని, 500 మంది రైతులతో కలిసి 1000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎన్ ఆర్ ఎస్ సి పోర్టల్ ద్వారా ఒక మీటర్ రిజల్యూషన్‌తో పంటలు, పురుగుల పరిస్థితిని గుర్తించే సాంకేతికత రైతులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సీసీఎంబి, ఎన్ ఐ ఎన్ వంటి జాతీయ స్థాయి సంస్థలతో సమన్వయం చేసుకొని పరిశోధనలు చేపట్టాలని సూచించారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆకుల విశ్లేషణకు అటామిక్ అబ్సార్ప్షన్ ఫోటోమీటర్ ద్వారా 15--30 నిమిషాల్లో ఫలితాలు పొందవచ్చని వివరించారు. కిసాన్ కార్డుల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరమని, ఉద్యాన పంటల సాగుకు రుణాల మంజూరులో నాబార్డ్ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. పరిశోధనా కేంద్రాల ప్రచురణలను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం సాంకేతిక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంయుక్త ఉద్యాన సంచాలకులు సంగీత లక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖాధికారులు, ఉద్యాన అధికారులు , విశ్వవిద్యాలయ అధికారులు రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, యూనివర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కె. వీరాంజనేయులు, డాక్టర్ జి పి సునందిని, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ మరియు డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ సురేష్ కుమార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్. శ్రీనివాసన్, టెక్నికల్ సెక్రటరీ డా. పిడిగం సైదయ్య, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ డి. విజయ, పి జి ఐ హెచ్ ఎస్ సిబ్బంది , జోనల్ హెడ్‌లు, స్టేషన్ హెడ్‌లు, శాస్త్రవేత్తలు, రైతులు మరియు వంటిమామిడి మార్కెట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కిషోర బాలికల రవాణా ఇబ్బందులను తొలగించాలి

## కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ సీట్లు కేటాయించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 29(నమస్తే ఉదయం):**



జోగులాంబ గద్వాల్ జిల్లా, గట్టు మండలంలో కిషోర బాలికల ఉన్నత చదువులకు రవాణా సౌకర్యం లేకపోవడం శాపంగా మారిందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యార్థినులకు సైకిళ్లు పంపిణి చేసి, కేజీబీవీ పాఠశాలల్లో హాస్టల్ సీట్లు కేటాయించాలని గట్టు మండల కిషోర బాలికల కమిటీ, మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం గట్టు మండల మహిళా సమాఖ్య ఏపీఎం కు కిషోర బాలికలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎఎస్ఎస్ అధ్యక్షురాలు వర్షిత, సీఆర్పీఎఫ్ మండల్ కన్వీనర్ జయమ్మలు మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుండి ఉన్నత పాఠశాలలకు ) వెళ్లే బాలికలు సరైన బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మైళ్ల దూరం నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామాల వారీగా బాలికల ఇబ్బందులు ఇవే:**

అంతంపల్లి , తుమ్మలపల్లి: ఈ గ్రామాల నుండి ఉత్తనూర్, ఆలూర్ జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లే దాదాపు 49 మంది బాలికలు ప్రతిరోజూ రాను-పోను 12 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణిస్తున్నారు.

పెంచికలపాడు మరియు రాయపురం: ఆరగిద్ద, గట్టు మరియు ఆలూర్ పాఠశాలలకు వెళ్లే సుమారు 83 మంది బాలికలు నిత్యం 10 కిలోమీటర్లు నడుస్తూ శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సుదూర ప్రయాణాల వల్ల బాలికలు అలసిపోయి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారని, భద్రతాపరమైన ఆందోళనల వల్ల కొందరు తల్లిదండ్రులు పిల్లలను చదువు మాన్పించే పరిస్థితి వస్తోందని కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కావున విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ 5 గ్రామాల బాలికలకు తక్షణమే ఉచిత సైకిళ్లను మంజూరు చేయాలని కోరారు. కేజీబీవీలలో ఇంటర్మీడియట్ సీట్లు కేటాయించాలని

మండలంలోని 14 గ్రామ పంచాయితీ పరిధిలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన 176 మంది కిషోర బాలికల పైచదువుల కోసం స్థానిక కేజీబీవీలలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ ఇ సి గ్రూపులలో హాస్టల్ వసతితో కూడిన సీట్లను ప్రత్యేక కోటా కింద కేటాయించాలని అధికారులను డిమాండ్ చేశారు. పేద విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు ఈ సమస్యపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో ఎపిఎం మారుతి, సిసి శేఖర్, ఎంవిఏప్ ఇంచార్జి కిరణ్ కుమార్, మొబైలైజర్స్ వీణ, ఫాతిమా, శృతి మరియు స్థానిక మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# న్యూస్ రూమ్ ఒత్తిడికి ధ్యానం సమర్ధ పరిష్కారం

## శాంతి సరోవర్ మీడియా సదస్సులో నిపుణుల సలహా

## సమాజానికి నాలుగో స్తంభం మీడియా: మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి

## అజాగ్రత్తగా ఉన్నా వార్తా కథనంలో కీలకమైన సమాచారం లోపిస్తుంది

## సామాజిక శాంతి కోసం ధ్యానసదస్సు

**రాజేంద్రనగర్,మే29(నమస్తే ఉదయం)**

గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీ శాంతి సరోవర్ క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం పదిన్నరకు మీడియా సదస్సు నిర్వహించారు.మీడియా,మెడిటేషన్ అండ్ సొసైటల్ పీస్ అంశం మీద జరిగిన సదస్సులో మీడియా ప్రతినిధులు దాదాపు 80 మంది హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.బ్రహ్మ కుమారీ హైదరాబాద్ సబ్ డివిజన్ డైరెక్టర్ రాజ్‌యోగిని బ్రహ్మకుమారి కుల్‌దీప్ దీదీ ఆహూతులకు ఆశీర్వచనం అందించి,మాట శక్తివంతమైనదన్నారు.మీడియా అంతర్ముఖ శాంతిని సాధించి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు.సమాజానికి బలం నాలుగో స్తంభమేమీడియా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమైనది.శాసన,కార్యనిర్వహక,న్యాయవ్యవస్థల పని తీరును సమాజానికి అద్దంలో చూపించే నాలుగో స్తంభం మీడియా.కాబట్టి మీడియా బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.మీడియా స్వేచ్ఛ కోల్పోయినా,అసత్య వార్తాకథనాలు ప్రసారం చేసినా,వార్తల ద్వారా సమాజంలో విభజనకు కారణమైనా ఆ సమాజం బలహీనపడుతుంది.మీడియా విశ్వసనీయత కోల్పోకుండా పనిచేయాలన్నారు.జర్నలిస్టులు ఒత్తిడిని జయించాలన్నా,తమ కలంతో సామాజిక శాంతి సాధించాలన్నా రాజయోగ ధ్యానం ద్వారా తమలో శాంతిని పెంపొందించుకోవాలన్నారు.బహుజన హితమే ప్రధానం ముంబయికి చెందిన డాక్టర్ సచిన్ పరేబ్ మీడియా ప్రతినిధులకు ఆరోగ్య సూచనలు చేశారు.ఒత్తిడి వల్ల గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది.రక్తపోటు పెరుగుతుంది.మెదడు పనితీరు మందగిస్తుంది.కాబట్టి విశ్రాంతి,సమతుల ఆహారం,క్రమబద్ధమైన జీవనశైలిని అనుసరించాలి.నిద్రకు ముందు మొబైల్ చూడడం మానేయాలన్నారు.మౌంట్ అబూలోని బ్రహ్మకుమారి ప్రధాన కార్యాలయం నుంచి మీడియా వింగ్ చైర్‌పర్సన్ రాజయోగి బీకే కరుణ వర్చువల్‌గా తన సందేశాన్నిచ్చారు.జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్ వర్మ మీడియా తమ వార్తా కథనాల్లో దూరదర్శన్ నినాదం సత్యం,శివం,సుందరం,ఆకాశవాణి నినాదం బహుజన హితాయ,బహుజన సుఖాయ' సూత్రాలను పాటించాలన్నారు.రాజయోగ టీచర్ సిస్టర్ అంజలి,సిస్టర్ ఉమారాణి,హైదరాబాద్ మీడియా కోఆర్డినేటర్ బ్రహ్మకుమారి కవిత పాల్గొన్నారు.వక్తలందరూ విలేఖరుల న్యూస్ రూమ్ ఒత్తిడికి ధ్యానమే సమర్థవంతమైన పరిష్కారం అని సూచించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బ్రహ్మకుమారి హైదరాబాద్ సబ్ డివిజన్ డైరెక్టర్ రాజ్‌యోగిని బ్రహ్మకుమారి కుల్‌దీప్ దీదీ




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి

**అనుక్షణం అప్రమత్తత ఇన్ఫర్మేషన్,మిస్ ఇన్ఫర్మేషన్,డిస్ ఇన్ఫర్మేషన్**

ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వార్తా కథనంలో కీలకమైన సమాచారం లోపిస్తుంది.ఆ సమాచారలోపం ఆ కథనాన్ని తప్పుడు సమాచారంగా మారుస్తుంది.కాబట్టి జర్నలిస్టులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.విధి నిర్వహణలో ఒత్తిడి రాజ్యమేలుతుంది. సమగ్రమైన, సంపూర్ణమైన ఆరోగ్యం గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ఏమిటంటే 'మెంటల్,ఫిజికల్,సోషల్,స్పిరిచువల్ హెల్త్' అని చెప్పింది.టెన్షన్ ను జయించాలంటే అటెన్షన్ ఒక్కటే మంత్రం.అది ధ్యానంతోనే సాధ్యం.స్వ పరివర్తన ద్వారా విశ్వ పరివర్తన సాధించగలుగుతాం.కాబట్టి మీడియా వ్యక్తులందరూ ధ్యానం ద్వారా స్వపరివర్తన సాధించాలి.మనసులో గదికి మనకు మనంగా వేసుకున్న తాళాన్ని మనమే తెరవాలి.ఆధునిక మానవుడు అన్నింటినీ జయిస్తున్నాడు.ఒత్తిడిని జయించలేకపోతున్నాడు.దాంతో నిద్రకు దూరమవుతున్నాడు.జంతువులు హాయిగా నిద్రపోతున్నాయి.జ్ఞానాన్ని పెంచుకున్న మనిషి నిద్రకు దూరమవుతున్నాడు.ధ్యానంతో మంచి నిద్ర సాధ్యమవుతుందన్నారు.

# సింగూరు ప్రాజెక్ట్ అత్యవసర పనులను వేగవంతం చేపట్టాలి: ఎండీ అశోక్ రెడ్డి

**హైదరాబాద్, మే29 ( నమస్తే ఉదయం)**




హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగూర్ రిజర్వాయర్ పరిధిలో చేపడుతున్న అత్యవసర పంపింగ్ ఏర్పాట్ల పై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఆరాదీశారు. పటాన్‌చెరు ట్రాన్స్మిషన్ డివిజన్ -2 పరిధిలో జరుగుతున్న ఎమర్జెన్సీ పంప్‌సెట్ అలైన్‌మెంట్ పనులను సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షించారు.సింగూర్ జలాశయంలో ప్రస్తుతం నీటి మట్టం 516.080 అడుగులుగా ఉండగా, అందుబాటులో ఉన్న నీటి నిల్వ సామర్థ్యం 5.477 టీఎంసీలుగా ఉందని... జూన్ 1, 2026 నుంచి అత్యవసర పంపింగ్‌ను పాక్షిక స్థాయిలో ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ఎండీకి వివరించారు. రిజర్వాయర్ 516.00 అడుగుల నీటి మట్టం వద్ద సుమారు 5.340 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులో ఉందని తెలిపారు.ఈ సందర్భంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అత్యవసర పంపింగ్ వ్యవస్థను సకాలంలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పంప్‌సెట్ అలైన్‌మెంట్, విద్యుత్ సరఫరా, మెకానికల్ లతో పాటు ఎలక్ట్రికల్ అంశాలన్నింటినీ సమన్వయంతో పూర్తి చేసి, అత్యవసర పంపింగ్‌ను నిర్దేశిత గడువులో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వ్యవహరించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి దశలో పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి: బొల్లా శ్రీనివాస్

## ఈనెల 31న మధుబన్ కాలనీ చౌరస్తాలో హిందూ సమ్మేళనం

**రాజేంద్రనగర్, మే 29(నమస్తే ఉదయం)**



అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని క మధుబన్ కాలనీ, పద్మశాలి పురం, ఆదర్శ కాలనీ, భవ్య ఋషి కాలనీ ప్రాంతాల హిందూ సమ్మేళనం ఈనెల 31వ తేదీన మధుబన్ కాలనీ (శ్రీ రామకృష్ణ హై స్కూల్ సర్కిల్) చౌరస్తా లో నిర్వహిస్తున్నట్లు హిందూ సమ్మేళనం చైర్మన్ బొల్లా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హిందువులు సంఘటితంగా ఉన్నప్పుడే భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమ్మేళనానికి హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 29(నమస్తే ఉదయం):**

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు.శుక్రవారం ధరూరు మండలం భీంపురం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతంను పరిశీలించి ఎప్పటికప్పుడు తూకం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జీలకు సూచించారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపిఎంఎస్ ను ఆన్లైన్లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ధరూరు తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది,తదితరులున్నారు.